క్లుప్తంగా

పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం



ఇబ్రహీంపట్నం: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన త్రిసభ్య కమిటీ సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమం సంఘ కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా త్రిసభ్య కమిటీ సభ్యులు చైర్మన్ కోయా నెహ్రూ, పర్సన్‌లు రాగా చిన్నజమలయ్య, నడకుదిటి విఘ్నేశ్వరరావును ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణ ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, బీజేపీ సీనియర్ నాయకులు రేగళ్ల రఘునాథరెడ్డి, కూనల యుగంధర్ పలువురు నాయకులు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో అభినందించారు. సొసైటీని ఆర్థికంగా బలోపేతం చేసి రైతులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



ఆగిరిపల్లి: మండలంలోని నెక్కలం గొల్లగూడెం సుందరయ్య నగర్ కాలనీలో నివసిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు డిమాండ్ చేశారు. నెక్కలం గొల్లగూడెంలో 2005లో గ్రామానికి చెందిన నిరుపేదలు నాలుగు ఎకరాల పొలంలో ఆక్రమించుకుని గుడిసెలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఎన్నికల్లో ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం పట్టాలు మంజూరు చేయాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల నాయకులు ముత్యాల నరేష్, షేక్ బాషా, శామ్యూల్, కిరణ్, సుందరయ్య నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

సారా తయారీదారుడు అరెస్టు

చాట్రాయి: నాటు సారా తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పోతనపల్లి తండాకు చెందిన ధారావతు నాగరాజు గతంలో నాటు సారా తయారు చేస్తుండగా దాడి చేయడంతో పారిపోయాడని, సోమవారం నాగరాజుని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం తిరువూరు కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

నూజివీడు ఏడీఏ బాధ్యతల స్వీకారం


జి.విద్యాసాగర్

నూజివీడు: వ్యవసాయశాఖ నూజివీడు సహాయ సంచాలకులు (ఏడీఏ)గా జి.విద్యాసాగర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన దీర్ఘకాల సెలవుపై విదేశాలకు వెళ్లగా ఇన్‌చార్జి ఏడీఏగా ఇప్పటివరకు ముసునూరు ఏఓ ఆలేరు చాముండేశ్వరి బాధ్యతలు నిర్వహించారు. విద్యాసాగర్ సెలవు ముగియడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

నేడు మారెమ్మ అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలో ఉన్న మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను మంగళవారం ఉదయం లెక్కిస్తామని ఆలయ ఈఓ వి.డి.డి.ప్రసాద్ సోమవారం తెలిపారు. దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీ కానుకలను లెక్కిస్తారన్నారు. విస్సన్నపేటలో ఉన్న గంగా పార్వతీ సమేత చంద్రశేఖరస్వామి దేవస్థానంలో హుండీలను అదే రోజు సాయంత్రం లెక్కిస్తారన్నారు.

రహదారి నిర్మాణం కోరుతూ సీపీఎం రాస్తారోకో



తిరువూరు: దీర్ఘకాలంగా పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణానికి నోచుకోని తిరువూరు–తోకపల్లి రహదారి పనులు వెంటనే ప్రారంభించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రహదారి గోతులమయమైందని, వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని సీపీఎం నాయకులు నాగేశ్వరరెడ్డి, నాగేంద్రప్రసాద్ అన్నారు. ఆరు నెలల క్రితం ఈ రహదారి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ప్రచారం చేసిన జనసేన నాయకులు ఇంతవరకు పనులు ప్రారంభం కాకపోతే ఎందుకు స్పందించట్లేదని ప్రశ్నించారు. అనంతరం రెవెన్యూ డివిజనల్ అధికారి మాధురికి మెమోరాండం సమర్పించారు.

నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం

- వంతెన పునఃనిర్మాణంపై నిర్లక్ష్యం వీడని ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో లోలెవెల్ చప్టా నిర్మాణం
- ప్రతిపాదనల దశలోనే నిలిచిపోయిన హైలెవెల్ వంతెన
- శిథిలమైన వంతెనపై ప్రమాదకర ప్రయాణం


హెచ్.ముత్యాలంపాడు, కందులపాడు గ్రామాల మధ్య శిథిల వంతెనపై రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు


హెచ్.ముత్యాలంపాడు, కందులపాడు గ్రామాల మధ్య బుడమేరు చప్టాపై భారీ వాహనాలు రాకపోకల వలన నిలిచిన ట్రాఫిక్

జి.కొండూరు: పాలకుల నిర్లక్ష్యంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఏళ్లు గడుస్తున్నా బుడమేరుపై హెచ్.ముత్యాలంపాడు వద్ద వంతెన పునర్నిర్మాణానికి అడుగు ముందుకు పడలేదు. దీంతో వాహన చోదకులు శిథిలమైన వంతెనపై ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం భారీ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ వంతెన పునర్నిర్మాణం చేయకపోవడంతో ట్రాఫిక్ సమస్య, ప్రమాదాలతో వాహన చోదకులు సతమతమవుతున్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చప్టా నిర్మాణం

హెచ్.ముత్యాలంపాడు-కందులపాడు గ్రామాల మధ్య బుడమేరుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరి వరద ఉధృతికి గతంలో కుంగిపోయింది. గత కొన్నేళ్లుగా ప్రమాదకరంగా ఉన్న ఈ వంతెన గత ఏడాది బుడమేరుకు వచ్చిన వరదలతో మరికొంత కుంగిపోయింది. దీని స్థానంలో నూతన వంతెన నిర్మాణం చేపట్టేందుకు గత సార్వత్రిక ఎన్నికల ముందు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రాకపోకలకు నిత్యం ఇబ్బంది తలెత్తుతుండడంతో హైలెవెల్ వంతెన నిర్మాణం చేపట్టి పూర్తయ్యే వరకు రాకపోకలకు ఇబ్బందిలేకుండా తాత్కాలిక వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో రూ.55 లక్షల ప్రభుత్వ నిధులతో లోలెవెల్ చప్టాను నిర్మించారు. దీనికి అప్రోచ్‌రోడ్డు ఏర్పాటుకు సైతం మరో రూ.16లక్షలు ఖర్చు చేశారు. అయితే బుడమేరు వరద ఉధృతి వలన కందులపాడు వైపు ఉన్న అప్రోచ్‌రోడ్డు పలుమార్లు కొట్టుకుపోయింది.

ప్రతిపాదనల దశలోనే...

బుడమేరుపై పాత వంతెన స్థానంలో నూతన హైలెవెల్ వంతెన నిర్మాణం చేపట్టేందుకు గత సార్వత్రిక ఎన్నికల ముందు అధికారులు రూ.8.5 కోట్లకు ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణాన్ని గాలికొదిలేసింది. ఏడాది కాలంగా వంతెన నిర్మాణానికి అడుగు ముందుకు పడకపోవడంతో వాహన చోదకులు నరకయాతన పడుతున్నారు. పక్కనే ఉన్న లోలెవెల్ చప్టాపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ద్విచక్ర వాహన చోదకులు, కార్లు సైతం శిథిల వంతెనపై రాకపోకలు సాగిస్తున్నారు. బుడమేరులో వరద ఉధృతి పెరిగినప్పుడు శిథిల వంతెనపై రాకపోకలు కొనసాగితే పెను ప్రమాదం జరిగి భారీగా ప్రాణ నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

నిత్యం రద్దీగా వంతెన

తిరువూరు, మైలవరం నియోజకవర్గాలలోని ప్రజలు ఆత్కూరు, ముత్యాలంపాడు గ్రామాల నుంచి ఈ వంతెన మీదుగా కందులపాడు, వెలగలేరు, కొత్తూరు తాడేపల్లి మీదుగా విజయవాడ వెళ్లేందుకు ఈ రహదారి షార్ట్‌కట్‌గా ఉంటుంది. విజయవాడలో ప్రముఖ కార్యక్రమాలు జరిగే సమయంలో హైదరాబాద్ వైపు నుంచి ఏలూరు, విశాఖపట్నం వైపు వెళ్లే భారీ వాహనాలను సైతం ఇబ్రహీంపట్నం నుంచి ఈ రహదారి వైపు మళ్లిస్తారు. నిత్యం భారీ వాహనాలతో రద్దీగా ఉండే ఈ వంతెన పునఃనిర్మాణంపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన లోలెవెల్ చప్టా పైన రాకపోకలు కొనసాగుతున్నాయి. వర్షాలు పడిన సమయంలో, వరద ఉధృతి పెరిగిన సమయంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. చప్టా వెడల్పు కూడా లేకపోవడంతో ఒక వైపు వాహనాలు వెళ్లిన తర్వాతనే మరో వైపు వాహనాలు వెళ్లాల్సి వస్తుంది. దీనితో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

వంతెన నిర్మాణం వెంటనే చేపట్టాలి



బుడమేరుపై వంతెన నిర్మాణం చేయకపోవడం వలన నరకయాతన పడుతున్నాం. చప్టా మీద భారీ వాహనాల రాకపోకల వలన బైకులు పాత వంతెన మీదుగా వెళ్లాల్సి వస్తోంది. పాత వంతెన ఎప్పుడు కూలుతుందో తెలియదు. వెంటనే వంతెన నిర్మాణం చేపట్టాలి.

– గంగుల సాంబశివరావు, వెలగలేరు

వంతెన నిర్మాణంలో నిర్లక్ష్యం వీడాలి



కందులపాడు వద్ద బుడమేరుపై వంతెన నిర్మాణం చేయకపోవడం వలన నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. బుడమేరుకు వరద వచ్చినప్పుడు రోజుల తరబడి వంతెన మీదుగా వెళ్లే పరిస్థితి ఉండదు. పాత వంతెన కూలిపోయే స్థితిలో ఉంది. చప్టా మీద ఎప్పుడూ ట్రాఫిక్ ఉంటుంది. గత్యంతరం లేక పాత వంతెన మీదుగానే వెళ్లాల్సి వస్తోంది.

– మందా రమేష్, చేగిరెడ్డిపాడు

ఎప్పుడు కూలుతుందో తెలియదు



కందులపాడు వద్ద వంతెన నిర్మాణం చేయకపోవడం వలన పాత వంతెన మీద సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. వంతెన ఎప్పుడు కూలుతుందో తెలియదు. వర్షాకాలం కూడా వచ్చిన నేపథ్యంలో బుడమేరుకు వరద వస్తే రాకపోకలు ఆగిపోతాయి. ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యం వీడి వంతెన నిర్మాణం చేపట్టాలి.

– పెయ్యల ప్రతాప్, వెలగలేరు

ప్రజల దృష్టిని మరల్చేందుకే తప్పుడు కేసులు

మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: పరిపాలన చేతకాక, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజల దృష్టిని మరల్చేందుకే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులపై అక్రమ కేసులను పెట్టి కక్ష సాధిస్తోందని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీ మిధున్‌రెడ్డిని అక్రమ కేసులో అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వం పని చేయాలే గాని ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి వేధించడానికి కాదన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లపై కూడా తప్పుడు కేసులు నమోదు చేసి జైళ్లలో పెట్టి వేధిస్తున్నారని, ఇది ఎంత మాత్రం మంచి పద్ధతి కాదన్నారు. రైతులకు ఇంతవరకు ఆర్థిక సాయం ఇవ్వలేదని, మహిళలకు నెలకు రూ.1500 ఎప్పుడిస్తారని, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు.

ఎంపీ మిధున్‌రెడ్డి అరెస్టు అక్రమం

చాట్రాయి: ఎంపీ మిధున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని మండల వైఎస్సార్ సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అక్రమ అరెస్టులతో పాలన చేస్తున్నారని విమర్శించారు. ఇకనైనా అక్రమ అరెస్టులను ఆపి పాలనపై దృష్టి పెట్టాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పరసా చెన్నారావు, వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు చెలికాని బాబ్జి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్


ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించకుండా గడువులోగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఆదేశించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి నిర్దిష్ట కాల పరిమితిని విధించారని, అర్జీలకు గడువులోగా నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. ఒకవేళ గడువులోగా సమస్యను పరిష్కరించలేకపోతే దానికి సంబంధించిన సరైన కారణాన్ని అర్జీదారుడికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి 23 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, డీఎల్‌పీఓ సుందరి, ఏడీఏ జి.విద్యాసాగర్, హెచ్‌ఓ ఆర్.హేమ, సీడీపీఓ పిల్లి విజయకుమారి, ట్రిపుల్ ఐటీ ఎస్‌ఐ జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వచ్చిన అర్జీల్లో ప్రధాన సమస్యలు

- నూజివీడు మండలం జంగంగూడెంలో సర్వే నంబర్ 109–2లో 3.45 ఎకరాల భూమి ఉందని, దీనికి పట్టాదారు పాసుపుస్తకం సైతం తీసుకున్నామని, అయితే ఈ నెల 16న ఆన్‌లైన్‌లో చూసుకోగా తన భూమి వివరాలు 3.23 ఎకరాలుగా చూపుతోందని గ్రామానికి చెందిన వల్లభనేని నాగేంద్రవరప్రసాద్ వాపోయారు. మొత్తం 3.45 ఎకరాలుగా నమోదు చేయాలని కోరారు.
- తనకు ఒక కుమార్తె, కుమారుడు ఉండగా తల్లికి వందనం కింద కుమారుడికి మాత్రమే డబ్బులు వచ్చాయని, కుమార్తెకు రాలేదని పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీకి చెందిన మరిచర్ల మౌనిక ఫిర్యాదుచేశారు. దీనిపై పాఠశాలకు వెళ్లి అడిగితే వివరాలన్నీ ఆన్‌లైన్ చేశామంటున్నారని, వార్డు సచివాలయానికి వెళ్లి అడిగితే స్కూల్‌కు వెళ్లి అడగమంటున్నారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ ఆమె అర్జీని అందజేశారు.
- తనకు 2008లో ప్రభుత్వం 1.10 ఎకరాల భూమిని పేదల కోటాలో ఇచ్చిందని, దానిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ వచ్చేలా చూడాలని కోరుతూ ముసునూరు మండలం రమణక్కపేటకు చెందిన ఆముదాల ఏసమ్మ అర్జీని అందజేశారు.

ఫ్లటర్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా ఎన్నో ఉపయోగాలు


లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అప్పారావు

మైలవరం: ఫ్లటర్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా ఎన్నో ఉపయోగాలున్నాయని రిసోర్స్ పర్సన్, డాటా వాల్లీ ట్రైనర్ ఎం.రఘువీర్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఫ్లటర్ ఫ్రేమ్‌వర్క్‌పై విద్యార్థులకు సోమవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. వర్క్ షాపు వారం రోజులపాటు జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. ట్రైనర్ రఘువీర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఫ్లటర్ ద్వారా ఆండ్రాయిడ్, ఐఓఎస్ రెండింటికీ ఒకేసారి యాప్‌లను రూపొందించడం ఫైర్‌బేస్ వంటి టూల్స్ ఇంటిగ్రేట్ చేయడం, హాట్ రీలోడ్ ద్వారా వేగంగా కోడ్‌లో మార్పులు చేయడం రిచ్ యూఐ డిజైన్ చేయడంపై అవగాహన కల్పించారు. వారం రోజుల వర్క్‌షాపులో ఒకే కోడ్ బేస్‌తో ఆండ్రాయిడ్, ఐఓఎస్ యాప్‌లను ఎలా రూపొందించాలో ప్రాక్టికల్ శిక్షణ ఇస్తారని, పూర్వపు మొబైల్ యాప్ డెవలప్‌మెంట్ పద్ధతులతో పోల్చి ఫ్లటర్ ఉపయోగాలు ఎలా ఉంటాయో ప్రాజెక్టు ఆధారంగా విద్యార్థులకు వివరిస్తూ ఒక ప్రాజెక్టును ప్రారంభం నుంచి డిప్లాయ్‌మెంట్ వరకు ఎలా చేయాలో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, ఐటీ విభాగాధిపతి డాక్టర్ డి.రత్నకిషోర్ ప్రసంగించారు. ఎం.విజయ్‌కుమార్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు.

ఇంటర్వ్యూలో సమయస్ఫూర్తితో సమాధానం చెప్పాలి

మైలవరం: విద్యార్థులు ఇంటర్వ్యూలలో సమయస్ఫూర్తితో సమాధానాలు చెప్పాలని ధిన్యూ సంస్థ సీఈఓ డాక్టర్ శాంతను రాయ్ వివరించారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐ అండ్ డీఎస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రెండు రోజుల ఇండస్ట్రీ రెడీనెస్ ప్రోగ్రామ్ జరిగింది. కార్యక్రమంలో డాక్టర్ శాంతను రాయ్ మాట్లాడుతూ స్వతహాగా ఐటీ పరిశ్రమల్లో వివిధ సాంకేతిక అంశాలలో నిష్ణాతులైన ఇంజినీర్ల ద్వారా విద్యార్థులు అవగాహన పొందుతారన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మనోధైర్యం, సాంకేతిక పరిజ్ఞానంలో వారి నైపుణ్యత, సామర్థ్యలో లోటుపాట్లు విద్యార్థులు తెలుసుకోగలుగుతారన్నారు. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ప్రాజెక్ట్స్, ప్లేస్‌మెంట్స్ కల్పించే విధానంలో కలిసి పనిచేద్దామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం విద్యార్థులకు కావాల్సిన ఇలాంటి ప్రయోజన కార్యక్రమాలు నిర్వహించడానికి సంపూర్ణ సుముఖతతో ఉందన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రతినిధులు పరిశ్రమలలో జరుగుతున్న పురోగతిని గురించి చర్చించారు. సాంకేతిక పోటీ ప్రపంచంలో తమ కళాశాల విద్యార్థులు ముందంజలో ఉండాలన్నారు. కార్యక్రమంలో డీన్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ డాక్టర్ వి.సూర్యనారాయణ, ప్రొఫెసర్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్ ఏఐ అండ్ డీఎస్ డాక్టర్ పి.భగత్ తదితరులు పాల్గొన్నారు. ఎస్.శివరామకృష్ణ, ఎస్‌వీవీడీ జగదీశ్ కోఆర్డినేటర్స్‌గా వ్యవహరించారు.

తొమ్మిదో రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె


కొండపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు


తిరువూరులో నగర పంచాయతీ కార్మికుల ధర్నా

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె సోమవారం తొమ్మిదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ తొమ్మిది రోజులుగా కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మికులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, ప్రభుత్వం ఇచ్చిన జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరుతున్నారని స్పష్టం చేశారు. తక్కువ వేతనం అందుకుంటున్న కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, బీమా సదుపాయం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం చేస్తామన్నారు.

కొనసాగిన నగర పంచాయతీ కార్మికుల సమ్మె

తిరువూరు: తమ సమస్యల పరిష్కారం కోరుతూ తిరువూరు నగర పంచాయతీలో కార్మికుల సమ్మె తొమ్మిదో రోజుకు చేరింది. పనికి తగిన వేతనం ఇవ్వాలని, పదవీ విరమణ అనంతరం రెగ్యులర్ కార్మికుల వలె ప్రయోజనాలు కల్పించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో తిరువూరు నగర పంచాయతీ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెతో పట్టణంలో తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

నేడు నగర పంచాయతీ అత్యవసర సమావేశం

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం ఉదయం జరుగుతుందని కమిషనర్ మనోజ్ఞ తెలిపారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ కె.నిర్మల అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో అజెండాలో పొందుపరిచిన అంశాలపై కౌన్సిలర్లు చర్చించి ఆమోదించనున్నట్లు తెలిపారు.

సీతమ్మకు సారె సమర్పణ



ఆగిరిపల్లి: స్థానిక కోదండ రామాలయంలోని సీతమ్మకు మహిళా భక్తులు సారె సమర్పించారు. ఆషాఢమాసం సందర్భంగా సోమవారం విజయవాడ రోడ్డులోని కోదండ రామాలయంలో మహిళా భక్తులు సీతారాములకు ప్రత్యేక పూజలు చేసి, సారె సమర్పించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నెమలి ఆలయంలో కొబ్బరి చెక్కల బహిరంగ వేలం

తిరువూరు: గంపలగూడెం మండలం నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో ఏడాదిపాటు కొబ్బరి చెక్కలు పోగుచేసుకునే హక్కు కోసం సోమవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ వేలంలో నెమలికి చెందిన కుంభగిరి మురళీకృష్ణ రూ.2.45 లక్షలతో పాట దక్కించుకున్నారు. గతేడాది ఈ వేలంపాట రూ.లక్షా 11వేల 500 వరకు రాగా ఈ ఏడాది రూ.1.33 లక్షలు అదనంగా దేవాలయానికి ఆదాయం లభించినట్లు సహాయ కమిషనర్ సంధ్య తెలిపారు. వేలంపాటను పుట్రేల మారెమ్మ దేవస్థాన ఈవో దుర్గాప్రసాద్, దేవాలయ చైర్‌పర్సన్ కావూరి శశిరేఖ సమక్షంలో నిర్వహించారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

జి.కొండూరు: ముప్పయవ నంబరు జాతీయ రహదారి నుంచి కుంటముక్కల గ్రామం వరకు ఉన్న ప్రధాన రహదారి పునఃనిర్మాణానికి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాబార్డు నిధులు రూ.1.32 కోట్లతో 2.200 కిలోమీటర్ల రోడ్డు పునఃనిర్మాణ పనులను చేపట్టినట్లు వివరించారు.

ఉచిత టైలరింగ్, ఫ్యాషన్ డిజైన్ శిక్షణ శిబిరం

విస్సన్నపేట: స్థానిక భగవాన్ సత్యసాయి సేవాసమితి, జనశిక్షణ సంస్థాన్ విజయవాడ(కేంద్రప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ ఎంట్రప్రెన్యూర్ షిప్ మంత్రిత్వ శాఖవారి సంస్థ)వారి నిర్వహణలో ఉచిత టైలరింగ్, ఫ్యాషన్ డిజైన్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవాసమితి కన్వీనర్ జగ్గవరపు రంగారెడ్డి సోమవారం తెలిపారు. శిక్షణ శిబిరంలో పాల్గొనటానికి 18 నుంచి 45 సంవత్సరాల వయస్సులోపు గల స్త్రీలు అర్హులన్నారు.ఆసక్తి గల వారు ఈ నెల 23, 24 తేదీలలో విస్సన్నపేటలోని భగవాన్ సత్యసాయి సేవాసమితి కార్యాలయంలో ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చేవారు ఆధార్ జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజ్ కలర్ ఫొటోలు, ఆధార్‌తో లింక్‌అప్ అయిన ఫోన్‌తో హాజరు కావాలన్నారు.

ఎమ్మెల్యే వసంతకు చేదు అనుభవం

- రాయనపాడులో సమస్యలతో స్వాగతం
- ఏడాది కాలంలో సుపరిపాలన ఏమీ జరగలేదు
- తొలి అడుగులో నిలదీసిన మహిళలు

రాయనపాడు(విజయవాడరూరల్): రాయనపాడు ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌కు మహిళలు సమస్యలతో స్వాగతం పలికారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం సాయంత్రం వచ్చిన ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్‌ను స్థానిక మహిళలు సంవత్సర కాలంలో ఎస్సీ కాలనీలో ఎలాంటి అభివృద్ధి పనులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. తల్లికి వందనంలో ఆర్థిక సహాయం అర్హులైన విద్యార్థులకు అందలేదన్నారు. కలపాల బుజ్జి మరి కొందరు మహిళలు తమ ఏరియాకు మంచినీరు రావడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రోడ్లు అధ్వానంగా వున్నాయని, రెండు ఎస్సీ కాలనీల మధ్యలో వున్న డ్రైనేజి కాల్వలో చెట్లు పెరిగి దోమలు ఉధృతంగా ఉండటం వలన చిన్నపిల్లలు అనేక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీకి చెందిన పంచాయతీ వార్డు సభ్యుడు మంద నాగరాజు ఎస్సీ కాలనీల్లో అభివృద్ధి పనులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. అభివృద్ధి పనుల విషయంలో పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల గురించి అడుగుతున్న సందర్భంలో పోలీసులు వచ్చి అతన్ని పక్కకు తీసుకెళ్లడంతో అరెస్ట్ చేస్తారా.. నేను పంచాయతీ వార్డు సభ్యుడిని.. అరెస్ట్ చేస్తే చేసుకోండని అన్నారు. ఎస్సీ కాలనీల్లో పలు సమస్యలను మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వాటిని ఎప్పుడు పరిష్కరిస్తారని అడిగారు. సంవత్సరంలో సుపరిపాలన తమ ఏరియాలో ఏమీ జరగలేదన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ చైర్మన్ నర్రా వాసు, కాటంనేని పూర్ణచంద్రరావు, శీలంనేని సాంబశివరావు తదితరులున్నారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

విస్సన్నపేట: స్థానిక వికాస్ పీజీ కాలేజీలో ఈ నెల 26వ తేదీన కేశినేని ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళా పోస్టర్‌ను సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ చేకు చినరాట్నాలు, కార్యాలయ సిబ్బంది ఆవిష్కరించారు. మండలంలోని విద్యార్థులు, నిరుద్యోగులు ఈ జాబ్ మేళాను సద్వినియోగించుకోవాలని ఎంపీడీఓ అన్నారు.